క్లుప్తంగా

అంజన్నకు అభిషేక పూజలు


పూజలందుకుంటున్న ఆంజనేయస్వామి

కౌతాళం: మండలంలోని ఆంజనేయస్వామి ఆలయాలు శనివారం భక్తులతో కిక్కిరిశాయి. మండల పరిధిలోని సుళేకేరి గ్రామ శివారులో వెలసిన బుడుములదొడ్డి ఆంజనేయస్వామి, అగసలదిన్నె ఆంజనేయస్వామి ఆలయాల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం స్వామి వారం కావడంతో భక్తులు వందలాదిగా తరలివచ్చి స్వామి వార్లను దర్శించుకున్నారు. తెల్లవారుజామున 5 గంటకు అర్చకులు వాయుపుత్రుడికి సుప్రభాత సేవ, మహామంగళహారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం నిర్వహించారు. బుడుములదొడ్డి ఆంజనేయస్వామి ఆలయంలో సీతారాములకు పూజలు నిర్వహించి దేవతామూర్తుల విగ్రహాలకు రథోత్సవం నిర్వహించారు.

భక్తులకు అన్నదానం


భక్తులకు అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

ఆదోని అర్బన్: స్థానిక ఎమ్మిగనూరు బైపాస్ రోడ్డులోని మహీంద్రషోరూం వద్ద శ్రీశైలం పాదయాత్ర భక్తులకు శనివారం దాతల సాయంతో అన్నదానం ఏర్పాటు చేశారు. ఈనెల 13వ తేదీ వరకు అన్నదానం చేస్తామని నిర్వాహకుడు అల్మూరుమఠం మహర్షి విజయ్‌కుమార్ తెలిపారు. తొమ్మిదేళ్లుగా మహాశివ రాత్రి పండగను పురస్కరించుకుని, ఆదోని చుట్టుపక్కల ప్రాంతాల వారు, పాదయాత్రగా శ్రీశైలానికి వెళ్లే భక్తులకు అన్నదానం చేపడుతున్నట్లు చెప్పారు.

ఘనంగా వీరమడివేళ మాచదేవా జయంతి


ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

ఆదోని రూరల్: మండలంలోని హాన్వాల్ గ్రామంలో ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి సహకారంతో వీరమడివేళ మాచదేవా జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. వీరమడివేళ మాచదేవా చిత్రపటంతో ఊరేగింపు చేశారు. అనంతరం లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఎంపీటీసీ ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలకు మరమ్మతులు

ఆదోని టౌన్: పట్టణంలో చెడిపోయిన సీసీ కెమెరాలకు శనివారం ఎలక్ట్రికల్ సిబ్బంది మరమ్మతులు చేశారు. 60 కెమెరాలు ఉండగా దాదాపు పది కెమెరాలు చెడిపోగా, వాటికి మరమ్మతులు చేశామని ఎలక్ట్రికల్ సిబ్బంది తెలిపారు. ఇటీవల కాలంలో పట్టణంలో చోరీలు, మున్సిపల్ అధికారులు, వార్డు సచివాలయ ఉద్యోగుల పేరుతో మోసాలు చేసిన ఘటనలు చోటుచేసుకున్న నేపథ్యంలో ట్రాఫిక్ పోలీసులు సీసీ కెమెరాలకు మరమ్మతులు చేయించారు.

భజన పోటీల్లో హలిగేర విజేత

ఆస్పరి: ఆస్పరి సమీపంలోని రామతీర్థంలో వెలసిన గాయత్రీ మాత ఆరాధనోత్సవాలు సందర్భంగా శుక్రవారం రాత్రి నిర్వహించిన రాష్ట్ర స్థాయి భజన పోటీల్లో మండలంలోని హలిగేర భజన జట్టు విజేతగా నిలిచింది. శనివారం మొదటి బహుమతిగా నిలిచిన హలిగేర భజన బృందానికి రూ.10,116, రెండో బహుమతి తురువగల్లుకు రూ.8,116, మూడో బహుమతి విరుపాపురానికి రూ. 6,116, నాలుగువ బహుమతి బవనసూరుకు రూ. 4,116వేలు, ఐదో బహుమతి పుష్పాలదొడ్డి భజన బృందానికి రూ.2,116 అందజేసినట్లు నిర్వాహకులు రూపామోహన్‌శర్మ తెలిపారు.

తాళి, మెట్టెలు వితరణ


యువతికి తాళి, నగదు, కాలిమెట్టెలు అందజేస్తున్న మనోజ్‌కుమార్‌రెడ్డి

ఆదోనిటౌన్: పట్టణంలోని బండిమెట్టలో నివాసముంటున్న పేద యువతి భాగ్యకు వివాహం నిశ్చయమైంది. కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగోలేదని తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు మనోజ్‌కుమార్‌రెడ్డి యువతికి తాళి, కాలి మెట్టెలు, కొంత నగదును అందజేశారు.

పత్తి ధర ఢమాల్

పత్తి ధరలు అమాంతం పడిపోయాయి. విత్తు వేసినప్పటి నుంచి పంట దిగుబడులు చేతికొచ్చేంత వరకు కంటికి రెప్పలా కాచుకున్న అన్నదాతలు.. ధర తగ్గిన విషయం తెలుసుకుని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడున్న ధరకు అమ్ముకుంటే పెట్టుబడులు కూడా రావని, అమ్ముకోకపోతే అప్పులు తీర్చే మార్గం లేదని ఆవేదన చెందుతున్నారు. కేంద్ర ప్రభుత్వం అన్నదాతను ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.


ఇంట్లోలోనే నిల్వ ఉంచిన పత్తి

- పడిపోయిన ధరలు.. ఆందోళనలో రైతులు
- ఇళ్లలో పేరుకుపోయిన దిగుబడులు

కౌతాళం: జిల్లాలోని పశ్చిమ ప్రాంతమైన ఆదోని డివిజన్‌లో అత్యధికంగా రైతులు పత్తి సాగు చేస్తున్నారు. అందులో కౌతాళం మండలంలో 80 శాతం మంది రైతులు రెండు దశాబ్దాలుగా పత్తినే ప్రధాన పంటగా సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ ఏడాది కూడా మండలంలో 73 వేల ఎకరాల సాగు భూమిలో 59 వేల ఎకరాల్లో పత్తి సాగు చేశారు. అధిక వర్షాల వల్ల దిగుబడి అంతంత మాత్రమే వచ్చింది. కొద్ది రోజుల క్రితం ధర బాగా ఉండటంతో కనీసం పెట్టుబడులు పోయి అంతోఇంతో మిగులుతుందని ఆశించిన రైతులకు ఇప్పుడు గుండె పగిలినంత పనైంది.

సగానికి తగ్గిన ధర..

గత ఏడాది పత్తి క్వింటాల్ ధర రూ.10 వేల నుంచి రూ.13 వేల వరకు పలికింది. దీంతో రైతులు ఈసారి పెట్టుబడులకు వెనుకాముందు చూడకుండా ఖర్చు చేశారు. ఎకరాకు దాదాపు రూ.30 వేల వరకు ఖర్చు చేశారు. ప్రస్తుతం దిగుబడులు చేతికి వచ్చాయి. పత్తి తీత పనులు చివరి దశకు చేరుకున్నాయి. నాణ్యత కల్గిన పత్తి క్వింటాల్ ధర ఆదోని మార్కెట్‌లో రూ.7,800, మధ్య ధర రూ.7,100, కనిష్ట ధర రూ.5,200 వరకు పలుకుతుండటంతో ఈ ధరలకు విక్రయిస్తే పెట్టుబడులు కూడా రావని దిగుబడులను ఇళ్లలోనే నిల్వ ఉంచుకుని ధర ఎప్పుడెప్పుడు పెరుగుతుందా అని ఎదురు చూస్తున్నారు. పత్తి ధరను నిర్ణయించే కేంద్ర ప్రభుత్వం, మార్క్‌ఫెడ్ వారు అన్నదాతలను ఆదుకోవాల్సి ఉందని పలువురు కోరతున్నారు.

ప్రతి ఇంట్లో పత్తి నిల్వలు

మండలంలో ఏగ్రామానికి వెళ్లినా 80 శాతం పత్తి దిగుబడులు రైతుల ఇళ్లలో ఉన్నాయి. సంక్రాతి తర్వాత ధర పెరుగుతుందని భావించిన రైతులకు నిరాశే మిగిలింది. పండుగ పోయి నెల గడిచినా ధర పెరగకపోవడంతో అప్పులకు వడ్డీలు పెరుగుతాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే పత్తి నిల్లలు ఇంట్లోనే ఉంచుకోవడంతో రైతులు చర్మవ్యాధుల బారిన పడుతున్నారు. పత్తి దిగుబడుల్లో పురుగు తయారై కుటుంబ సభ్యులు ఒళ్లంతా దురద, దద్దుర్లతో బాధ పడుతున్నారు.

ఎకరాకు రూ.30 వేలు ఖర్చయింది



నాలుగు ఎకరాల్లో పత్తి సాగు చేశాను. ఎకరాకు రూ.30వేల వరకు పెట్టుబడి పెట్టాను. అధిక వర్షాల వల్ల దిగుబడి తగ్గింది. ఎకరాకు 5 నుంచి 6 క్వింటాళ్ల వరకు వచ్చింది. ధర లేక పోవడంతో ఇంట్లోనే నిల్వ ఉంచుకున్నా. ఈ ధరకు అమ్మితే నష్టపోతాను. ధర కోసం వేచి ఉన్నా. కేంద్ర ప్రభుత్వం స్పందించి రైతులకు న్యాయం చేయాలి. – ఉప్పర లింగన్న, రైతు

ధర కోసం వేచిచూస్తున్నా



10 ఎకరాల్లో పత్తి సాగు చేశాను. అప్పుల కోసం తక్కువ ధరకే 15 క్వింటాళ్ల పత్తి అమ్ముకున్నా. ఇంకా ఇంట్లో 30 క్వింటాళ్ల పత్తి ఉంది. మంచి ధర వచ్చేంత వరకు వేచిచూస్తున్నా. ఇప్పటికే మూడు నెలలు గడిచిపోయింది. అధిక వర్షాల వల్ల దిగుబడి కూడా పెద్దగా రాలేదు. ఎకరాకు 4 నుంచి 5 క్వింటాళ్ల పత్తి వచ్చింది. కేంద్ర ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలి.
– మహబుబ్‌బాషా, రైతు

రాష్ట్ర స్థాయి కబడ్డీ విజేత కోసిగి


గెలుపొందిన జట్టుకు నగదు బహుమతి అందజేస్తున్న ఎంపీపీ ఈరన్న

కోసిగి: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో రేణుక ఎల్లమ్మ జాతర సందర్భంగా ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ మురళీ మోహన్ రెడ్డి సహకారంతో ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో కోసిగి చెన్నకేశవ జట్టు విజేతగా నిలిచింది. శనివారం కోసిగికు చెందిన చెన్నకేశవ, హనుమాన్ జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ రసవత్తంగా జరిగింది. హనుమాన్ జట్టుపై చెన్నకేశవ జట్టు గెలుపొందింది. విజేతలకు ఎంపీపీ ఈరన్న, ఆర్లబండ సహకార సంఘం అధ్యక్షుడు మహాంతేష్ స్వామి, నాడుగేని నాగరాజు, జెడ్పీటీసీ మాజీ సభ్యులు దళవాయి మంగమ్మ చేతుల మీదుగా నగదు బహుమలు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, బాలుర ఉన్నత పాఠశాల పీడీ ఖలీల్ అహ్మద్, ఆర్గనైజర్స్ పాల్గొన్నారు.

దున్నపోతును ఢీకొన్న ట్రావెల్స్ బస్సు

మంత్రాలయం రూరల్: కర్ణాటక రాష్ట్రం రాయచూర్ నుంచి మంత్రాలయం మీదుగా బెంగళూరుకు వెళ్తున్న శ్రీనివాస ట్రావెల్స్ బస్సు మండల పరిధిలోని చిలకలడోణ సమీపంలో దున్నపోతును ఢీకొంది. దున్నపోతు గ్రామంలో మారెమ్మవ్వకు దేవర నిమిత్తం వదిలినట్లు గ్రామస్తులు తెలిపారు. గాయపడిన దున్నపోతు పరిస్థితి విషమంగా ఉంది. ప్రయాణికులకు మాత్రం ఎలాంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

రమణీయం..ఎల్లమ్మ రథోత్సవం


భారీ జనసందోహం మధ్య సాగుతున్న రథోత్సవం (ఇన్‌సెట్‌లో)అమ్మవారిని దర్శించుకుంటున్న నాయకులు

కోసిగి: ప్రజల ఆరాధ్య దైవం, కొలిచే వారి కొంగు బంగారంగా విరాజిల్లుతున్న రేణుక ఎల్లమ్మ దేవి మహా రథోత్సవం శనివారం వేలాది మంది భక్తుల మధ్య రమణీయంగా సాగింది. మాఘమాసం పంచమిని పురస్కరించుకుని వేకువ జామున అమ్మ వారికి విశేష పూజలు చేపట్టి మహామంగళ హారతులు గావించి భక్తులకు దర్శనం కల్పించారు. తెల్లవారుజాము నుంచే భక్తాదులు అమ్మ వారి దర్శనం కోసం క్యూ కట్టారు. కోసిగితో పాటు జిల్లా నలు మూలల నుంచే గాక కర్ణాటక, తెలంగాణ, మహారాష్ట్ర నుంచి భక్తులు తరలి వచ్చి అమ్మవారికి కుడుములు, గుగ్గిళ్లు, నైవేద్యం, నారికేళాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. చర్మ వాధులు ఉన్న వారు మొక్కుబడిగా అమ్మ వారికి ఉప్పు సమర్పించి పూజలు చేసుకున్నారు. సాయంత్రం దివంగత మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ రాజు దొర ఇంటి నుంచి ఆయన కుమారులు శ్రీనివాస రాజు దొర, మురళీ దొరల ఆధ్వర్యంలో పూర్ణకుంభాన్ని కలశాలు, మేళాతాళాలతో ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకుని రథానికి పూజలు చేశారు. అనంతరం అమ్మ వారి మూలవిరాట్‌ను రథంపై కొలువుంచి అమ్మవారి పాదాల చెంత వరకు లాగి, తిరిగి యథాస్థానానికి చేర్చారు. రథోత్సవంలో భక్తులు అరటి పళ్లు విసిరి మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సీనియర్ నాయకుడు వై.సీతారామిరెడ్డి, మండల ఇన్‌చార్జ్ మురళీ మోహన్ రెడ్డి హాజరయ్యారు.

రాజీ మార్గమే రాజమార్గం

ఆదోని రూరల్: రాజీ మార్గమే రాజ మార్గమని జిల్లా రెండో అదనపు న్యాయమూర్తి పి.జె.సుధ అన్నారు. జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని శనివారం స్థానిక జిల్లా రెండో అదనపు కోర్టు ఆవరణలో చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి మూడు నెలలకోసారి జాతీయ మెగా లోక్‌అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని కక్ష్యిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. లోక్ అదాలత్ ద్వారా 5,139 కేసులు పరిష్కామయ్యాయన్నారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు శ్రీకాంత్, శైలజ, వెంకట నాగలక్ష్మి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా రెండో అదనపు న్యాయమూర్తి పి.జె.సుధ

వైద్యం దైవాధీనం


హొళగుంద పీహెచ్‌సీ

- హొళగుంద పీహెచ్‌సీకి ఇద్దరు డాక్టర్లు నియామకం
- ఒకరు విధుల్లో చేరనేలేదు.. మరొకరు అనధికారిక గైర్హాజరు
- సకాలంలో రోగులకు అందని వైద్యసేవలు

హొళగుంద: మండల ప్రజలకు వైద్యం దీవాధీనంగా మారింది. అత్యవసర పరిస్థితుల్లో ఆస్పత్రికి వస్తే ప్రాణాలు నిలుస్తాయన్న నమ్మకం లేకుండా పోయింది. పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నా.. కొందరు డాక్టర్ల వల్ల లక్ష్యం నీరుగారుతోంది. ఇక్కడ నియమించిన ఇద్దరు డాక్టర్లు తమ విధుల పట్ల బాధ్యతారాహిత్యంతో ఉండటంతో పలువురు రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శనివారం అత్యవసర వైద్యం నిమిత్తం వచ్చిన ఓ మహిళకు స్టాఫ్ నర్సులే దిక్కుగా మారి ప్రాథమిక చికిత్స చేశారు. అనంతరం ఆదోనికి రెఫర్ చేయగా మార్గమధ్యలోనే ఆమె ప్రాణాలొదిలింది. ఇద్దరు డాక్టర్లలో ఒక్కరైనా విధుల్లో ఉండి ఉంటే మెరుగైన వైద్యం అంది మహిళ ప్రాణాలతో ఉండేదేమోనని బాధితురాలి బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు.

విధుల్లో చేరని డాక్టర్.. అనధికార సెలవుపై మరో డాక్టర్

పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులు ఉండేవారు. అందులో ఇటీవల డాక్టర్ రాధను ఉన్నతాధికారులు గజ్జహళ్లి పీహెచ్‌సీకి బదిలీ చేశారు. ఆమె స్థానంలో గజ్జహళ్లి పీహెచ్‌సీ డాక్టరు న్యూటన్‌ను హొళగుందకు బదిలీ చేశారు. అయితే ఆయన ఇప్పటి వరకు ఇక్కడ విధుల్లో చేరకుండా సెలవుల్లో ఉన్నారు. కాగా మరో డాక్టరు వెంకటసుబ్బయ్య. ఈయన దాదాపు రెండు నెలలుగా పీహెచ్‌సీ గడప తొక్కలేదు. అలాగని సెలవు కూడా పెట్టలేదు. ఈయన విషయమై ఆదోని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సత్యవతిని వివరణ కోరగా ఆస్పత్రికి న్యూటన్, వెంకటసుబ్బయ్య అనే ఇద్దరు డాక్టర్లను నియమించామన్నారు. డాక్టర్ న్యూటన్ విధుల్లో చేరకుండా సెలవులో ఉండగా వెంటక సుబ్బయ్య విధులకు సక్రమంగా హాజరు కావడం లేదన్నారు. పలుమార్లు మెమోలు ఇచ్చినా అతనిలో మార్పు లేదన్నారు. డాక్టర్ వెంకటసుబ్బయ్య విషయాన్ని డీఎంహెచ్‌ఓ దృష్టికి కూడా తీసుకెళ్లామన్నారు.

14 నుంచి అల్లిసాహెబ్ ఉత్సవాలు


అల్లి సాహెబ్ స్వామి దర్గా

గోనెగండ్ల: మండల పరిధిలోని హెచ్ కైరవాడి గ్రామంలో 14వ తేదీ నుంచి అల్లిసాహెబ్ స్వామి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. 14న స్వామివారి గంధం, 15న ఉరుసు, 16న కిస్తీ కార్యక్రమాలు ఉంటాయి. అల్లిసాహెబ్ ఉరుసును కులమతాలకు అతీతంగా జరుపుకుంటారు. స్వామి వారికి భక్తులు ఇసుకను నైవేద్యంగా సమర్పిస్తారు. గ్రామ సమీపంలో ఉన్న హంద్రీలోని ఇసుకను ఎద్దుల బండితో తీసుకువచ్చి స్వామి వారికి సమర్పించి తమ సమస్యలు విన్నవిస్తారు. వచ్చే ఏడాదిలో అవి పరిష్కారమవుతాయిన గ్రామస్తుల నమ్మకం. దీంతో గ్రామంలోని భక్తులతో పాటు ఇతర గ్రామాల భక్తులు ఎద్దుల బండ్ల ద్వారా ఇసుకను స్వామి వారికి సమర్పిస్తారు. చల్లని ఇసుకను సమర్పిస్తే స్వామి చల్లగా తమ కోర్కెలు తీరుస్తాడని నమ్మకం. ఇది ఎన్నో ఏళ్లుగా వస్తున్న ఆచారమని గ్రామస్తులు చెబుతున్నారు. అలాగే దర్గా ప్రాంగణంలోనే ఎల్లమాంబదేవి ఆలయం ఉంది. ప్రతి రోజు భక్తులు దర్గాతో పాటు ఎల్లమాంబ ఆలయంలోనూ పూజలు చేస్తారు. దర్గా, ఆలయం పక్కపక్కనే ఉన్నప్పటికీ ఎటువంటు భేదాభిప్రాయలు లేకుండా రెండు వర్గాల వారు ప్రార్థనలు, పూజలు నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

20 నుంచి హిమాంకాశీం స్వామి ఉరుసు

కృష్ణగిరి: మండల పరిధిలోని పోతుగల్లు గ్రామంలో వెలసిన భక్తుల ఆరాధ్య దైవం హిమాంకాశీం స్వామి ఉరుసును ఈ నెల 20 నుంచి మూడు రోజులు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. 20న గంధం, 21న ఉరుసు, 22న కిస్తీ వేడుకలతో ఉరుసు ఉత్సవాలు ముగిస్తాయని వారు తెలిపారు.


దర్గాను రంగులతో అలంకరిస్తున్న దృశ్యం

అట్టహాసంగా ఎడ్ల బండ లాగుడు పోటీలు


బండ లాగుతున్న ఎద్దు

ఆలూరు: దేవనకొండ మండలం కొత్తపేట గ్రామంలో హజరత్ దివాన్ మస్తాన్‌వలి స్వామి ఉరుసు సందర్భంగా ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి ఎడ్ల బండ లాగుడు పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. పోటీలను జెడ్పీటీసీ సభ్యుడు రామకృష్ణ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ లక్ష్మీదేవి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కప్పట్రాళ్ల మల్లికార్జున, కొత్తపేట గ్రామ సర్పంచ్ షేకమ్మ పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్

పత్తికొండటౌన్: రథోత్సవం సందర్భంగా పత్తికొండ పట్టణంలో నిర్వహించిన అండర్–19 క్రికెట్ టోర్నమెంట్ శనివారం ముగిసింది. విన్నర్స్ జట్టు కు రూ.10,016 నగదు, ట్రోఫీని వైఎస్సార్‌సీపీ నా యకులు, ఎంపీటీసీ సభ్యుడు జంగం నీలకంఠ, రన్నర్స్ జట్టుకు రూ.4,016 నగదు, ట్రోఫీని రాష్ట్ర టైలర్స్ అసోసియేషన్ కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి, మూడవ బహుమతి రూ.2,016 నగదు, ట్రోఫీని వార్డుసభ్యుడు టైలర్ రంగన్న అందజేశారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ రాజేశ్, పీఈటీలు పాల్గొన్నారు.


ట్రోఫీ అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు నీలకంఠ

క్రీడా పోటీలు ప్రారంభం

ఆదోని అర్బన్: పట్టణంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఆదోని జోన్ అంతర్ పాఠశాలల బాలుర బాస్కెట్‌బాల్ పోటీలు శనివారం ఏపీ పీఈటీ, ఎస్ఏపీఈ ఆదోని జోన్ అసోసియేషన్, ఎస్‌జీఎఫ్ కర్నూలు ఆధ్వర్యంలో ప్రారంభమయ్యాయి. ఆర్ట్స్ కళాశాల పీడీలు ఎర్రిస్వామి, కంబిరెడ్డి పాల్గొని క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడల ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఆరోగ్యాన్ని పొందవచ్చన్నారు. అవసరమైన క్రమశిక్షణ, పట్టుదల, ఏకాగ్రత అందిస్తాయని, ప్రతిరోజు గంట సమయాన్ని ఆరోగ్యం కోసం కేటాయించాలన్నారు. కార్యక్రమంలో జోన్ అధ్యక్షులు నరసింహులు, కార్యదర్శి నరసింహరాజు, కోశాధికారి ఆనంద్, పీఈటీలు ముజాయిద్, రామన్న, రాజు, శేఖర్ పాల్గొన్నారు.


బాస్కెట్‌బాల్ ఆడుతున్న క్రీడాకారులు

అడ్డదారి..ప్రమాదకారి

త్వరగా గమ్యస్థానాలకు చేరుకోవాలని కొందరు.. అత్యవసర పరిస్థితుల్లో మరికొందరు.. రవాణా ఖర్చుల భయంతో ఇంకొందరు రైల్వే గేట్లపై అడ్డదారి గుండా రాకపోకలు సాగిస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికే పలువురు తిరిగిరాని లోకాలకు వెళ్లగా.. మరికొందరు అంగవైకల్యంతో బాధ పడుతున్నారు. అయినా ప్రజల్లో మార్పు రావడం లేదు. అధికారులైనా అడ్డదారి ప్రయాణాలను అరికట్టి ప్రజల ప్రాణాలు కాపాడాలని పలువురు కోరుతున్నారు. – ఆదోని టౌన్


- ప్రమాదకరంగా రైల్వే గేట్లు దాటుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు


రైలు ట్రాక్‌పై అడ్డంగా రాకపోకలు నిర్వహిస్తున్న ప్రజలు

ఆదోని రైల్వేస్టేషన్ పరిధిలో నగరూరు–ఆదోని, ఆదోని–రాయనగర్, కుప్పగల్, ఇస్వీ క్రాస్, పాండవగల్లు క్రాస్‌ల వద్ద నిత్యం అడ్డదారిలోనే రాకపోకలు సాగిస్తూ నెలకు ఐదారు మందికి పైగా మృత్యువాత పడుతున్నారు. పట్టణ సరిహద్దు వరకు రైలు పట్టాలకు ఇరువైపులా రక్షణ గోడ లేకపోవడంతో ఆత్మహత్యలు చేసుకునే వారు కూడా ఎక్కువే. ఇలా బలవన్మరణాలకు పాల్పడే వారి సంఖ్య నెలకు 20 నుంచి 30 దాకా ఉంటుందని, యేడాదికి సుమారు 300 మందికి పైగానే ప్రాణాలను కోల్పోతున్నట్లు రైల్వే రికార్డులు చెబుతున్నాయి. ఇంతమంది ప్రాణాలకు హానీ కలిగించడం, అంగవైకల్యానికి కారణం పట్టణంలోని కొంతమంది వ్యాపారులే కారణమవుతున్నారనే విమర్శలు కూడా లేకపోలేదు. గతంలో రైల్వేశాఖ నిర్మించిన రక్షణ గోడను వ్యాపార అవసరాల కోసం ఎక్కడపడితే అక్కడ రంధ్రాలు వేయడంతో వాటినే ప్రజలు అడ్డదారిగా చేసుకుని రాకపోకలు సాగిస్తూ ప్రమాదాలను కొని తెచ్చుకుంటున్నారు.

ఆదోని డివిజన్‌లోని 297 గ్రామ పంచాయతీల పరిధిలో సుమారు 15 లక్షల జనాభా ఉంది. వివిధ పనులపై ఆదోనికి వచ్చే వారి సంఖ్య సుమారు లక్ష దాకా ఉంటుంది. రైతులు పంట ఉత్పత్తులను వ్యవసాయ మార్కెట్ యార్డుకు ఆటోలు, లారీల్లో తీసుకొస్తారు. పంటలను అమ్ముకుని తిరిగి వెళ్లే సమయంలో అడ్డదారి గుండా వెళ్తూ కొంతమంది ప్రమాదం బారిన పడిన ఘటనలు కూడా ఉన్నాయి. మరికొంతమంది రైతులు ఓవర్‌బ్రిడ్జి కింద వెళ్తూ దొంగలబారిన పడి నిలువునా దోపిడీకి గురైన సందర్భాలున్నాయి. ఓవర్ బ్రిడ్జి కింద సాయంత్రం 7 గంటలు దాటిందంటే రాకపోకలు సాగించాలంటేనే భయపడుతున్నారు. రైల్వే పోలీసులు, లోకల్ పోలీసులు ప్రజలకు భద్రత కల్పించలేకపోతున్నారనే విమర్శలున్నాయి.

ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్నాం



అడ్డదారిలో ప్రయాణం ప్రమాదకరం. ఇటు వెళ్లడం రైల్వే యాక్ట్ 144 ప్రకారం నేరం. ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహిస్తూ చైతన్యవంతం చేస్తున్నాం. ఓవర్ బ్రిడ్జి కింద ఫుట్‌వేర్ బ్రిడ్జి గుండా వెళ్లాలని సూచనలు చేస్తున్నాం. అడ్డదారి ప్రయాణం ప్రాణాలకే ప్రమాదమని వివరిస్తున్నాం. – టి.లక్ష్మన్న, ఆర్‌పీఎఫ్ ఎస్‌ఐ